నీటి వాడకంపై అవగాహన

విశాలాంధ్ర-జి.మాడుగుల : జల్ ఉత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జి.మాడుగుల మండలంలోని నుర్మతి గ్రామ పంచాయతీలో జి. మాడుగులలోని మండల మహిళా సమాఖ్య భవనంలో 172 అంగన్వాడీ వర్కర్స్‌కు, స్థానిక జీటీడబ్ల్యూఎస్ బాలుర పాఠశాలలో 94 మంది ఉపాధ్యాయులకు నీటి వాడకంపై అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ పి పుల్లయ్య గారు, ఆనంద్ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో నీటితో ముడిపడి ఉండుట వలన బంధం ఏర్పడిందని అందుకే దానిని లిలిజల్ బందన్‌లిలి అంటారని, నీటికి విలువ నిస్తూ, వృధాగా వాడకూడదు, నీటి దుర్వినియోగం చేయకుండా అరికట్టెల ప్రజలకు తెలుప వలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. నీటిని నిల్వచేసుకోవాలని, పునర్ ఉపయోగం అయ్యేలా చెయ్యాలని తెలిపారు. అనంతరం నీటి నాణ్యత పరీక్షలు చేసి వాడకానికి అనుకూలంలో ఉందా లేదో తెలియజేప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ పుల్లయ్య, ఆనంద్, ఎంఈఓ బాబురావు, సీడీపీఓ శ్రీమతి సువర్ణ, ఆర్ డబ్ల్యూ యస్ జేయి విజయ్ కుమార్ గారు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సూపర్ వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్కిగ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి : ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర-అరకులోయ : మండలంలోని మారుమూల గ్రామమైన బస్సుకి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. మంగళవారం అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 20 మంది చిన్నారులను పరామర్శించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు గిరిజన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. 20 మంది చిన్నారులకు జ్వరం, కళ్ళ కలకలు, శర్మ వ్యాధి, వాంతులు విరోచనాలతో గత వారం రోజుల నుండి తీవ్ర ఇబ్బందులతో అరకు ఏరియ ఆసుపత్రికి అడ్మిట్ అయి ఉన్నారని వారిని మెరుగైన వైద్యం అందించాలన్నారు. చికిత్స పొందుతున్న వారిలో కుర్ర చరణ్ తేజ్ , గొల్లూరి నందిని, వంతల భానుమతి, వంతల సాయి పల్లవి, స్వాభి కుమార్, సమర్ది అనిత, సమర్ది నవ్య శ్రీ, స్వాభి శ్రావణ్, వంతల నిర్మల, వంతల గౌతం, కుర్ర సామేలు, కొర్ర రితిక, వంతల పాండ్యా, కొండంగి హర్షిత ప్రియ,, స్వామి దిలిత, స్వాభి నితిన్, కుర్ర సూర్య తేజ్, పాంగి అభిలాష్ లు చికిత్స పొందుతున్నారని గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మెరుగైన సేవలు అందించాలన్నారు. అలాగే పారిశుద్యం, అపరిశుభ్రంపై మంచినీటిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు

గంజాయి మొక్కలు పండిస్తున్న 18మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండలంలోని సొలభం పంచాయతీకి చెందిన దేగలరాయి గ్రామంలో సోమవారం గంజాయి పండిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీస్, రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో దేగలరాయి గ్రామ పరిసరాలన్నీ తనిఖీ చేయగా 20 ప్రదేశాలలో గంజాయి తోటలను గుర్తించడం జరిగిందని జి.మాడుగులు సీఐ సన్యాసినాయుడు, ఎస్సై షణ్ముఖరావు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 05 ఎకరాలో 1000 గంజాయి మొక్కలను గుర్తించామని చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు సదరు గంజాయి మొక్కలను ధ్వంసం చేసి పెట్రోల్ పోసి కాల్చడం జరిగినదన్నారు. సదరు గంజాయి మొక్కలు పండిస్తున్న వ్యక్తుల గురించి ఎంక్వైరీ చేసి, అదే గ్రామానికి చెందిన 18 వారిని నిందితులుగా గుర్తించి వారి పై జిమాడుగుల పోలీస్ స్టేషన్ లో ఎన్ డి పి ఎస్ చట్టం క్రింద, అటవీ చట్టం క్రింద క్రైమ్ నెంబర్ 50/24గా కేసు నమోదుచేసి సదరు గంజాయి పండించిన 18 మంది ముద్దాయి లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారిని కోర్టులో కోర్టు హాజరు పరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించడమైనది అని చెప్పారు. గంజాయి సాగుకు దూరంగా ఉండాలని, ఈ తరహా అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

రైతుకు అదనపు అదాయంతోనే సుస్థిరత : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : రైతుకు అదనపు ఆదాయంతోనే సుస్థిరత ఉంటుందని, ఆ దిశగా ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక పిఎంఆర్ సి సమావేశ మందిరంలో జరిగిన సెల్లర్స్ అండ్ బయ్యర్స్ మీట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి రైతు ఎఫ్‌పిఓలో చేరాలని తద్వారా రైతు శక్తి పెరుగుతుందని, సమైక్యంగా ఉంటే వారు అనుకున్న ధర సాధించగలరని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో సౌకర్యాలు కల్పిస్తున్న ప్పటికీ మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించట్లేదన్న అపవాదు ఉందని దానిని రూపుమాపాలని, మధ్యవర్తుల ప్రమేయాన్ని అరికట్టాలని సూచించారు. జిల్లాలో మూడు వేల ఎఫ్‌పిఓలు ఉన్నాయని, రైతులు ఎఫ్‌పిఓలుగా ఏర్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెరటి కోళ్ళు, వివిధ వ్యవసాయ మరియు అనుబంధ ఉత్పత్తులు, మార్కెట్ ట్రెండ్‌లు, మరియు విలువ అందించే ఉత్పత్తుల గురించి వివిధ కొనుగోలు దారులతో చర్చించడంతోపాటు వివిధ కొనుగోలు దారులు, అమ్మకందారులు/ ఎఫ్‌పీఓల మధ్య పలు ఒప్పందాలు జరిగాయి.

ఉద్యానవన పంటల అభివృద్ధికి చర్యలు : ఐటీడీఏ పీఓ

విశాలాంధ్ర-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన రైతుల ఉద్యానవన పంటలు అభివృద్ధి చేయుటకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక హెచ్ఎంటీసీ ఫారంలో జీడి మామిడి మొక్కల అంట్లు, మామిడి మొక్కల అంట్లు, జాఫ్రా మొక్కల అంట్లు ఏర్పాటు చేయుటకు ప్రాజెక్ట్ అధికారి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ఏడు మండలాలలో గిరిజన రైతులు ఉద్యానవన పంటలు వేసుకునే విధంగా సబ్సిడీపై 2024-2025 సంవత్సరమునకు గాను సుమారు 30 వేల ఉద్యానవన పంటల మొక్కల అంట్లు గిరిజనులకు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే సంవత్సరం సుమారు 50వేల ఉద్యానవన పంటలు మొక్కలు అంట్లు కట్టే విధంగా ప్రతిపాదనలు తయారుచేసి సమర్పించాలన్నారు. అదేవిధంగా మారేడుమిల్లి గ్రామంలో మళ్లీ ఉద్యానవన పంటల మొక్కల నర్సరీ, అదేవిధంగా రబ్బర్ మొక్కల అంట్లు ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏజెన్సీలోని గిరిజన రైతులు ఉద్యానవన పంటల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి కే. చిట్టిబాబు, సహాయకులు భీమన్న, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు : లైబ్రరీయన్ సునీత

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14 నుంచి 21 వరకు 57వ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వారోత్సవాలను పురస్కరించుకొని వారం రోజులపాటు రోజువారీగా విద్యార్థులకు, చిన్నారులకు పలు రకాల ఆటల పోటీలు, వ్యాస రచన, వంటి పోటీలను నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు చిన్నారులకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతాదన్నారు. ఈ వారోత్సవాలకు విద్యార్థులు, చిన్నారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

చికిత్స పొందుతూ గిరిజన మహిళ మృతి

విశాలాంధ్ర-కొమరాద : గత రెండు రోజుల నుండి చికిత్స పొందుతూ గిరిజన మహిళ మృతిచెందినట్లు ఎస్సై కేనీలకంఠం తెలిపిన వివరాల ప్రకారం చిన్న ఖేడ్జల పంచాయితీ సర్వపాదు గ్రామానికీ చెందిన కద్రక కాంతమ్మను ఆమె అల్లుడు తో కలిసి మోటార్ సైకిల్ పై వెళు తుండగా ఈనెల 10వ తేదీని కొమరాడలో చదువుతున్న తన కుమార్తె వద్దకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో కొత్తవలస గ్రామం వద్ద స్పీడ్ బ్రేకర్‌పై బైక్ క్రాస్ అయ్యేటప్పుడు వెనుక కూర్చున్న కాంతమ్మ తుళ్ళి రోడ్డుపై పడిపోవడంతో తలకి వెనుక భాగంలో గాయం అవ్వడం తో వెంటనే పార్వతీపురం ప్రభుత్వ హాస్పిటల్ తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా ఆసుపత్రికి తీసుకు వెళ్లి చికిత్స పొందుతూ మంగళవారం కాంతమ్మ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు కాంతమ్మకు భర్త నలుగురు పిల్లల్లో ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం ఎస్సై తెలిపారు.

గ్రామాల మధ్య దూరం తగ్గాలంటే కనెక్టివిటీ రహదారులు అవసరం

సుమారు రూ. నాలుగున్నర లక్షలతో నిర్మించనున్న లింకు రహదారి పనులకు శంకుస్థాపన

లంబసింగి సర్పంచ్ శాంతి కుమారి, ఎంపీటీసీ నాగమణి వెల్లడి

విశాలాంధ్ర-చింతపల్లి : గ్రామ గ్రామానికి లింకు రహదారులు అవసరమని లంబసింగి పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలు కే శాంతి కుమారి, ఆర్ నాగమణి అన్నారు. ఆ పంచాయతీలోని లబ్బంగి గ్రామంలో సుమారు నాలుగున్నర లక్షల రూపాయల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న గ్రామ గ్రామానికి కనెక్టివిటీ రహదారి నిర్మాణానికి ఉపాధి హామీ పథకం సిబ్బందితో కలిసి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్య ప్రాంతంలోని గ్రామాలలో రహదారి సమస్య ప్రధాన సమస్యగా ఉండేది అన్నారు. ఆ సమస్యకు పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ గ్రామానికి లింకు రహదారులు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా లబ్బంగి కొత్త వీధి నుండి లబ్బంగి గ్రామాన్ని కలిపే 750 మీటర్ల లింకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ విధంగా నిర్మాణం అవుతున్న రహదారులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ రఘునాథ్, వైసీపీ సీనియర్ నాయకుడు నూకరాజు, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ ఇమ్మానుయేల్, వీ ఆర్ పి లు రాధ, విజయలక్ష్మి, ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో లక్ష్యం నెరవేరాలి : ఎంపీడీవో కుమార్

విశాలాంధ్ర-అనంతగిరి : అనంతగిరి మండలంలో ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇచ్చిన లక్ష్యాన్ని చేదించాలని అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ ఆదేశించారు. మంగళవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా లబ్ధిదారులకు వంద రోజులు కల్పించడం మరియు ఆర్ వో ఎఫ్ ఆర్ లబ్ధిదారులకు 150 రోజులు పని రోజులు కల్పించాలని తెలిపారు. అదేవిధంగా మండలంలో 9,552 మంది ఉపాధి హామీ లబ్ధిదారులు తప్పకుండా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కనుక ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని చేదించేందుకు కృషి చేయాలని తెలిపారు. హౌసింగ్ మరియు హార్టికల్చర్ పనులకు పని రోజులు కల్పించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఫార్మా ఫండ్స్ గ్రౌండ్ చేసి కంప్లీట్ చేయడం మొదలు కొని పలు విషయాలపై రివ్యూ చేసి ప్రగతి లేని సిబ్బంది పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి పవన్, ఏపీవో, టిఏలు, వీఆర్పీలు పాల్గొన్నారు.

వికలాంగుడికి సదరం సర్టిఫికెట్ మంజూరు

10 నెలల నిరీక్షణకు తెర... విశాలాంధ్ర కథనాలకు స్పందన

విశాలాంధ్ర-కూనవరం : ప్రమాదవశాత్తు ఒక కాలు కోల్పోయిన బత్తుల కొమరయ్య కుటుంబం పడుతున్న ఆర్థిక మానసిక బాధని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో విశాలాంధ్ర సఫలీకృతమైంది. ఈనెల 8న పెన్షన్ కోసం పడరాని పాట్లు, ఈనెల 9న సాంకేతిక లోపం వికలాంగుడి శాపం అనే రెండు కథనాలను విశాలాంధ్ర ప్రచురించింది.కాగా10 నెలలుగా తనకి సదరం సర్టిఫికెట్ మంజూరు కావడంలో సాంకేతిక సమస్య తలెత్తిందని గుర్తించిన అధికారులు విశాలాంధ్ర కథనాలకి స్పందించి సాంకేతిక సమస్యను సరిచేసి మంగళవారం కొమరయ్యకు సదరం సర్టిఫికెట్ను అందించారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తన ఇబ్బందిని గుర్తించి తనకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేసిన ఉన్నతాధికారులు అందరికీ, తనను ఆ విధంగా చూడగానే వార్త రాసి తన సమస్యను కలెక్టర్ దాకా తీసుకెళ్లిన విశాలాంధ్రకి కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తక పఠనం ద్వారా మేధాశక్తి పెంపుదల : ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు



విశాలాంధ్ర-సీతంపేట : మండల కేంద్రంలో ఎన్టీఆర్ పార్క్ సమీపంలో విశాలాంధ్ర మొబైల్ పుస్తక వానాన్ని సందర్శించిన ఐటీడీఏ ఏపీవో చినబాబు పుస్తక ప్రదర్శన మొబైల్ వాహనం సందర్శించి వారికి అవసరమైనటువంటి పలు పుస్తకాలను కొనుగోలు చేసి విశాలాంధ్రలో ఇప్పటివరకు అనేక పుస్తకాలను తమ పిల్లల కోసం కొనుగోలు చేసి వారికి ఇచ్చిన సందర్భంలో వారి చదువుకు ఎంతో గానో తోడ్పాటు అందించాయని అదే విధంగా పుస్తక పఠనం ద్వారా అనేక ముఖ్యమైన విషయాలు తెలుసుకుని మేదో శక్తి పెంపొందించుకోవడం జరుగుతుందని ఏపీవో చిన్నబాబు తెలిపారు. విశాలాంధ్ర పుస్తక మొబైల్ వాహనం సందర్శించిన కార్యక్రమంలో డిడి అన్నదొరై, పీహెచ్ ఓ వెంకట గణేష్, డిప్యూటీ ఈవో నారాయదు, ఏఎంఓ కోటిబాబు పలువురు ఉపాధ్యాయులు యువత ఐటిడిఏ సిబ్బంది విశాలాంధ్ర మొబైల్ వాహనాన్ని సందర్శించి అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేశారు. విశాలాంధ్ర సంస్థను ప్రోత్సహించినందుకు విశాలాంధ్ర తరపున వారందరికీ ధన్యవాదాలు విశాలాంధ్ర మొబైల్ వాహనం టీం వారు తెలిపారు.

అసెంబ్లీలో ఉన్న ఏడుగురు ఎమ్మెల్యేలు జీవో నెంబర్-3 కోసం పోరాడాలి

ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దర్శి సతీష్

విశాలాంధ్ర-కొయ్యూరు : ఆదివారం సిపిఐ మండల కార్యదర్శి ఇరువాడ దేవుడు, గిరిజన సమైక్య మండల కార్యదర్శి పోటుకూరి దార మల్లేష్, మాజీ సర్పంచ్ గుమ్మా.రాంబాబు, ఇరవవాడ రాజబాబులతో కలిసి ఎన్నికల ముందు అరకు వ్యాలీ విచ్చేసిన అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని ఏపీ గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షులు దర్శి. సతీష్ కోరారు. అలాగే జీవో నెంబర్ మూడుకై పోరాడాల్సిన బాధ్యత గిరిజన ఎమ్మెల్యేలపై ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. జీవో నెంబర్ మూడును ఇటీవల సుప్రీంకోర్టు రద్దు చేయడం వలన విద్యాభ్యాసం చేసిన ఎంతోమంది గిరిజన నిరుద్యోగులకు నష్టం కలుగుతుందని, దేశంలోని 192 ఐటిడిఏల పరిధిలో బీఈడీ డిఈడి చేసిన గిరిజన నిరుద్యోగులకు ఈజీవో నెంబర్ మూడు రద్దు ఎంతో నష్టాన్ని చేకూరుస్తుంది అన్నారు. ప్రతి ఐటీడీఏ పరిధిలో ఉపాధ్యాయ పోస్టులను స్పెషల్ డిఎస్సీ ద్వారా గిరిజనులకు కేటాయించాలన్నారు. స్పెషల్ డిఎస్సి రద్దు ద్వారా గిరిజనులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న ఏడుగురు గిరిజన ఎమ్మెల్యేలు జీవో నెంబర్ పోరాడాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన : ఎస్ఐ రాజేష్

విశాలాంధ్ర-సీతానగరం : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రోడ్డు నియమ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు నివారణ జరక్కుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజేష్ తెలిపారు.మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో హనుమాన్ కూడలి వద్ద వాహనాలు తనిఖీలు చేస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా యువత, వాహనదారులు తప్పనిసరిగా నియమనిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికా మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు పెద్ద ఎత్తున నమోదు చేస్తున్నట్లు తెలిపారు.ఇటీవల కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అన్ని వర్గాలవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత డ్రగ్స్ వైపు వెళ్ళవద్దని సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతిరోజు అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈకార్యక్రమంలో ఏఎస్ఐలు శ్రీనివాసరావు,లక్ష్మణరావులు పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు, వాహనదారులు పాల్గొన్నారు.

పాడేరు ఏకలవ్య ఫౌండేషన్ రైతులు పంటల పరిశీలన

విశాలాంధ్ర-పాచిపెంట : ఏకలవ్య ఫౌండేషన్ పాడేరు వాటర్ షెడ్ మేనేజర్ ఎం.ఉమా వెంకటేష్ ఆధ్వర్యంలో 20మంది రైతులు పాచిపెంట మండలంలో పాగు కూరగాయల సాగును మంగళవారం పరిశీలించారు. అలాగే పి.కొన వలస తెట్టెడువలస మాతమూరు పాచిపెంట గ్రామాలలో సాగులో ఉన్న వివిధ కూరగాయల నమూనాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా పాచిపెంట మండల వ్యవసాయ కార్యాలయంలో ఉన్న ప్రకృతి సేద్య వనరుల కేంద్రాన్ని సందర్శించారు. వ్యవసాయ అధికారి కే.తిరుపతిలో మాట్లాడుతూ రైతులను వేరే జిల్లాలలో క్షేత్ర సందర్శనానికి తీసుకువచ్చి నందుకు ఏకలవ్య ఫౌండేషన్ను అభినందించారు. అనంతరం రైతులకు పాచిపెంట మండలంలో సాగుతున్న పంటల స్థితిగతులు ప్రకృతి సేద్యానికి అమలు చేస్తున్న ప్రణాళికలు వ్యవసాయ అధికారి తిరుపతిరావు వివరించారు. జీవామృ తాలు కషా యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ టెక్నికల్ కోఆర్డినేటర్ జి చంటిబాబు ప్రకృతి సేద్య సిఆర్పి సురేష్ విజయ్ మరియు రైతులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పట్టణములోని పేదలకు రెండుసెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని,ఇల్లు నిర్మాణం పూర్తి కోసం రూ 5లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి. సురయ్య అన్నారు. మంగళవారం పట్టణములోని పలు వార్డుల్లో సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం బికేఏమ్యూ, ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు రుణ సౌకర్యం కల్పించాలన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు పట్టణాలలో ఒక సెంటు చొప్పున ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆయా ఇళ్ల స్థలాలు పట్టణానికి దూరంగా నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో కేటాయించడం వలన చాలామంది పేదలు స్థలాల పట్ల శ్రద్ధ చూపలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే సెంటు స్థలం పేదల నివాసానికి ఏమాత్రం సరిపోదని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు ఆనాడే వైసీపీ ప్రభుత్వానికి చెప్పినప్పటికీ, ఖాతర చేయకుండా ప్రభుత్వం ముందుగా వెళ్ళింది. కాకి లెక్కలతో 32 లక్షలు మందికి పట్టాలి ఇచ్చినప్పటికీ పేదలు ఆ స్థలాల పట్ల సముఖముగా చూపలేదన్నారు. పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం 1,80,000 మాత్రమే ప్రకటించారు, ఆర్థిక సహాయంతో పునాదులు కూడా పూర్తి చేయలేదని పేదలు ఎవరు కూడా ఇంటి నిర్మాణం చేపట్లేదు, వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు పట్టాలునిరుపయోగంగామారాయన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముఖ్యమంత్రి అదే విధంగా హామీ ఇస్తూ ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల చొప్పున ఇస్తామని చెప్పడం జరిగింది, ఇంటి స్థలాల కేటాయింపు పట్ల చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూలమే అయినప్పటికీ, సిమెంటు ఇటుక, ఇసుక, ఇనుము, కంకర తదితర సామాగ్రి ధరలు పెరిగాయి కాబట్టి రూ5 లక్షల రూపాయలు పెంచి గృహ నిర్మాణం మంజూరుకి చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో గ్రామాల్లో నివాసయోగ్యంగా గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన లేఔట్లను మార్పు చేసి పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని రోడ్లు, విద్యుత్తు, తాగునీరు, డ్రైనేజీ, నీటిపారుదల వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం రూ 5లక్షలు మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.

బిత్తరపాడులో మనబడి-మనతోట

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని బిత్తరపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద పలు పంటలయిన,ఆకు, కూరకాయలు, తీగ జాతుల విత్తనాలు ఉపాధ్యాయులు, రైతులు విద్యార్థులు కలిపి సాగుచేశారు. ఈ సంద్భంగా గ్రామానికి విచ్చేసిన ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ షణ్ముఖరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏ విధమైన రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా, సహజ వనరులను ఉపయోగించుకొని రైతులు అన్ని రకాల పంటలు పండించడం జిల్లాలో జరుగుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని పాఠశాలలలో ఖాళీగా ఉన్న ప్రదేశాలలో మనబడి -మన తోట కార్యక్రమం అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా అమలు చేయడంలో భాగంగా పాఠశాలలోని పిల్లలకు పని అనుభవం ద్వారా మరియు ఆకు, కాయగూరలు, తీగ జాతులు, పండ్ల మొక్కలు మొదలగునవి పెంచడంలో నైపుణ్యముతో పాటు మెలకువలు, పురుగులు, తెగుళ్ల తెలుసుకోవడమే కాకుండా అక్కడ పండే ఆహార పదార్థాలు మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించుకోవడం వల్ల పిల్లలకు పౌష్టికాహారం లభించడం జరుగుతుందని అందుకు ప్రతి ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు,విద్యార్థిని ,విద్యార్థులు సహకారం ఎంతైనా అవసరం ఉంటుందని అందుకు మా కార్యకర్తలు కూడా అందు బాటులో వుండి తగు సూచనలు సలహాలు ఇవ్వడానికి అందుబాటులో ఉండడం జరుగుతుందని,పిల్లలు పాఠశాలలో నేర్చుకొన్న విషయాలు, వారి ఇంటి వద్ద తల్లి దండ్రులు వివరించడంతో పాటు, వారి యొక్క పొలాలలోని పంటలపై ఆచరించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం హరికృష్ణ, ఉపాధ్యాయులు,జి .అన్నపూర్ణ సిబ్బంది ధనుంజయ, లత ,నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సంరక్షణ చట్టాలపై అవగాహన తప్పనిసరి : సిఐడి రీజనల్ అధికారి డాక్టర్ ప్రేమ్‌కాజల్

విశాలాంధ్ర-కురుపాం : ఎస్సీ ఎస్టీ సాధికారత కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన న్యాయ సంరక్షణ చట్టాలు, సంక్షేమ పథకాలు పై యువత అవగాహన కలిగి ఉండాలని సిఐడి విశాఖ రీజియన్ ఆఫీసర్ డాక్టర్ ప్రేమ్ కాజల్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రైవేటు కళ్యాణ మండపంలో యువతకు ఎపి సిఐడి డిజి ఎన్.రవిశంకర్ అయ్యనార్ ఆదేశాలు మేరకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా "ఎంపవర్మెంట్ ఆఫ్ షెడ్యూల్ ట్రైబ్ కమ్యూనిటీ అండ్ సెన్సిటైజేషన్ ఆన్ ప్రివెన్షన్ ఆఫ్ ఎట్రాసిటీ ఎగినెస్ట్ దెమ్" అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం గిరిజన సంఘాల ప్రతినిధులు, మండలస్థాయి అధికారుల నుంచి సంబంధిత అంశంపై వివరాలు తెలుసు కున్నారు. ఈసందర్భంగా వివిధ మండలాలనుండి వచ్చిన యువతకు అవగాహన కల్పించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఈ వర్క్ షాప్‌లు నిర్వహించి ఎస్సీ ఎస్టీ యువత లో చైతన్యం నింపే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని యువత ఉత్సాహంగా పాల్గొని అవగాహన పొంది మిగిలిన వారికి చైతన్య పరచాలని చట్టం ఏఒక్కరికి చుట్టంగా మారకూడదని అన్నారు. వక్తలు ఎస్సీ ఎస్టీ పిఓఎ యాక్ట్ గూర్చి, కేసుల రిజిస్ట్రేషన్ గూర్చి, ఇన్వెస్టిగేషన్లో, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, ఎస్సీ ఎస్టి పిఓఎ యాక్ట్ గురించి, బాదితుడు సమస్య, హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వాహకులు-సిఐడి, రీజినల్ ఆఫీసు, విశాఖపట్నం, ఏపీ వారు కార్యక్రమానికి హాజరైన వారికి పరీక్ష నిర్వహించి వారికి బహుమతులు అందజేయడం జరిగింది. సిఐడి డిఎస్పీ కె.కుమారస్వామి పర్యవేక్షణలో, పీవీ. నరసింహారావు, సిఐ బుచ్చిరాజు, పాలకొండ డిఎస్పీ ఎం.రాంబాబు, సోషల్ వెల్ఫేర్ డిడి గయాజుద్దీన్, పార్వతీపురం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జోగారావు, ఎంపీడిఓ ఉమామహేశ్వరి, తహశీల్దార్ రమణమ్మ, యస్.సొసైటీ ప్రతినిధి షేక్ గౌస్, ఐఆర్పీడబ్ల్యూ ప్రకాష్, గిరిజన సంఘాల నాయకులు లోవరాజు, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు

విశాలాంధ్ర-బెలగాం : గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆర్డీవలస, ఉద్దవోలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో పని తీరు పరిశీలనలో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మిక తనిఖి చేసారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో గల 105 రకాల మందులు, 14 రకాల పరీక్షలు, మాతృ శిశు సేవలు, రికార్డులు, పూర్తి పనితీరుని పరిశీలించారు. ఆరోగ్య మందిర్ యొక్క అభివృద్ధికి తగు సూచనలు చేశారు. కార్యక్రమములో రాష్ట్ర ఆరోగ్య శాఖకు చెందిన సీనియర్ అధికారులు డాక్టర్ ప్రతిభ, విబిడి కన్సల్టెంట్ శ్రీకాంత్, వైద్యాధికారి డాక్టర్ ఎస్. సంతోష్ కుమార్, ఎస్.యు.ఓ ధనుంజయ్, హెచ్.వి ఉదయకుమారి, ఎం.ఎల్.హెచ్.పి ఇంద్రాణి, ఎఎన్ఎం ఎస్.వి రమణమ్మ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది హాజరయ్యారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర-వీరఘట్టం : గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో బి.వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రధానంగా రహదారుల నిర్మాణం త్రాగునీటి సమస్య పారిశుధ్య నిర్వహణ ప్రజలకు అందుబాటులో తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ డి కళ్యాణదుర్గ, ఉపాధి ఉపాధి ఏపీఓ జి సత్యంనాయుడు, ఏపిఎం కే రాము సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కాసాపేటలో పంటకోత ప్రయోగం



విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని కాసాపేట గ్రామంలో రైతుల పంట పొలములో పంటకోత ప్రయోగమును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, మండల వ్యవసాయ అధికారి అవినాష్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ సతీష్, వీఏఏ జగదీష్, రైతులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నివారించండి మహాప్రభో

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణంలో వీధికుక్కలు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయి. మున్సిపాలిటీలోని ముప్పై వార్డుల పరిధిలోని వీధిలలో కుక్కలు స్వైర విహారం చేయడం వల్ల పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత కొన్ని సంవత్సరాలు క్రితం కుక్కలకు మున్సిపల్ శాఖ సిబ్బంది కుటుంబ నియంత్రణ చేయించి పట్టణానికి దూరంగా విడిచి పెట్టారని, అప్పటినుంచి కొంతకాలం కుక్కలు బాధ తప్పిందని, మరలా ఈ మధ్యనే వీధికుక్కలు వీధులలో ఎక్కువగా తిరుగుతున్నాని దీనికి కారణంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ అధికారులు వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైసిపి నేత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-బలిజీపేట : మండలంలోని పెద్దింపేట గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు మొదిలి సాంబమూర్తి అన్నయ్య కుమార్తె అనారోగ్య కారణంగా విశాఖలో అకాలమరణం చెందిన సమాచారాన్ని తెలుసుకొన్న పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పెద్దింపేట వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. ఆయనతో మండల పార్టీ అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, జడ్పీటీసీ అలజంగి రవికుమార్, సర్పంచ్ అలజంగి జయ ప్రకాష్, వైసిపి సీనియర్ నాయకులు గోళ్ళ పకీరు నాయుడు, గంట్యాడ శ్రీరాములు నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌గా చల్లారావు

విశాలాంధ్ర - చింతూరు : చింతూరు మోటార్ వెహికిల్ ఇనస్పెక్టర్‌గా బందారు చెల్లారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై చింతూరుకు బదిలీపై వచ్చారు.

శ్రీ సూర్యపీఠంలో శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారికి స్వర్ణ కమలార్చన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం పట్టణ శివారులో ఉన్న శ్రీసూర్యపీఠంలో అశేషశేముషినిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి దంపతులచే శ్రీరమా సత్యనారాయణ స్వామి వారికి స్వర్ణకమలార్చన జరిగింది. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. వేమకోటి వివేకానంద్ శర్మ, టి.రామకృష్ణశర్మలు వైదికసహకారం అందించారు. అయ్యప్ప దీక్ష చేస్తున్న స్వాములు సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. నారాయణ ఉపనిషత్, విష్ణు సహస్రనామ పారాయణలు చేశారు.

కాశీ పట్టణంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో



కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్య అధికారిని జ్ఞానేశ్వరి తెలిపారు. ఇటీవల పలు దినపత్రికల్లో కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో జ్వరాలు తీవ్రత ఎక్కువగా ఉందని వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కథనాలు వచ్చిన నేపథ్యంలో వైశ్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యము అందించమని వైద్య అధికారిని తెలిపారు. గ్రామంలో 35 మందికి ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేయడం జరిగిందని అన్నారు. ఈ టెస్టుల్లో ఎవరికి ఎటువంటి పాజిటివ్ రాలేదని అన్ని నెగిటివ్స్ వచ్చాయని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రతి సబ్ సెంటర్లో అందుబాటులో ఉంటున్నారని ఎవరికి ఎటువంటి వైద్య సహాయం కావాలన్నా వెళ్లి వైద్య సేవలు పొందాలని ఆమె కోరారు. వ్యాధి తీవ్రమైనప్పుడు వైద్యం కోసం వెళ్లకూడదని వ్యాధి సోకినప్పుడే వైద్య సేవకు వెళితే వైద్య సహాయం అంది తిరిగి కోల్కుంటారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఎం పి హెచ్ ఓ నర్సింగరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నట్లు తెలిపారు.

విద్యారంగంలో వికసించిన కుసుమం తెర్లి రవికుమార్



విశాలాంధ్ర-బెలగాం : కొందరు తమకోసం తాము జీవిస్తుంటారు. మరికొందరు ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తమ జీవితాన్ని త్యాగం చేస్తుంటారు. అటువంటి వారిలో రెండవ వర్గానికి చెందినవారే తెర్లి రవికుమార్, వీరు నారాయణమూర్తి, సత్యవతి దంపతులకు తే 08-08-1968దీన జన్మించారు. వీరి భర్త పేరు అంపిల్లి సాగర్. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లుగా చిన్నతనం నుండి సమాజానికి సేవ చేయాలనే తపన వీరిలో మెండుగా ఉండేది. అదే తపన వీరిని విద్యారంగంలో ఉన్నత శిఖరాలను చేరుకునేటట్లు చేసింది. వీరు ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్టరర్ (ఎకనామిక్స్) గా విధులు నిర్వహిస్తున్నారు.

అవార్డుల పంట.... తెర్లి రవికుమార్ సమాజానికి, విద్యారంగానికి చేస్తున్న సేవలను గుర్తించి అనేక సంస్థలు వీరిని అవార్డులతో సత్కరించాయి. బెస్ట్ జూనియర్ లెక్చరర్ జిల్లా స్థాయి అవార్డును కలెక్టరు గారి చేతుల మీదుగా అందుకున్నారు. 2024 సం.రంలో మదర్ థెరిసా సేవా సంస్థచే గురుబ్రహ్మ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. అంతేకాకుండా అనేక సంస్థలు వీరిని అవార్డులతో సత్కరించాయి. తెర్లి రవికుమార్ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని భగవంతుడు వీరికి, వీరి కుటుంబానికి ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని విశాఖపట్నం మదర్ థెరిసా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కె. కృష్ణమూర్తి మనస్పూర్తిగా కోరుకున్నారు.

ఉల్లాష్ కార్యక్రమం ద్వారా ప్రతీ మహిళ అక్షరాస్యులు కావాలి



ఎంపిడిఒ త్రివిక్రమరావు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని ప్రతిగ్రామంలో ఉన్న వెలుగు సభ్యుల్లంతా అక్షరాస్యులు కావాలని, దీనికోసం నిర్వహించే ఉల్లాష్ కార్యక్రమమును విజయవంతం చేయాలని ఎంపీడీవో పాండ్రంకి త్రివిక్రమరావు తెలిపారు. మంగళవారంనాడు వెలుగు ఆధ్వర్యంలో మండలసమాఖ్యలో ఒకరోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా 1430మంది మహిళలను తీసుకొని, 143 మంది వాలంటీర్లును ఏర్పాటుచేసి వారంతా అక్షరాస్యులు అయ్యేలా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడు నెలలపాటు జరిగే ఈ కార్యక్రమంలో ఆ సంఘాల్లో మొదటి విడతగా ఎంపికచేసిన 1430 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. దీనిని అన్ని శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈకార్యక్రమం ఉద్దేశంను మండల వెలుగుఎపిఎం శ్రీరాములునాయుడు వివరించారు. మండలంలోని వెలుగుసంఘాల్లో ఉన్న డ్వాక్రా మహిళలను శతశాతం ఈ కార్యక్రమం ద్వారా దశలవారీగా అక్షరాసులుగా తీర్చిదిద్ది విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలమేరకు ఈకార్యక్రమంను మండలంలో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసిలు, మండల సమైక్య, గ్రామసమైక్య సభ్యులు, డ్వాక్రా మహిళలు, విద్యా వాలంటీర్లు పాల్గొన్నారు.

రీ ఓరియంటేషన్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

ఎంఎల్ హెచ్‌పిల శిక్షణ తరగతులలో టిబి యూనిట్ ఎం ఓ టి సి డాక్టర్ లక్ష్మీకాంత్

విశాలాంధ్ర-చింతపల్లి : రీ ఓరియంటేషన్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఎం ఎల్ హెచ్‌పిలు సంక్రమిత వ్యాధులైన క్షయ, హెచ్ఐవి, లెప్రసీ వంటి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చింతపల్లి టిబి యూనిట్ ఎంటిటిసి, లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీకాంత్ అన్నారు. చింతపల్లి, జీ కే వీధి మండలాలకు చెందిన టీవీ యూనిట్ సభ్యులు, సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలతో లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి జీవన లక్ష్యాలు, విలువలు లేదా ప్రాధాన్యతలలో ఘననీయమైన మార్పును, వ్యక్తి దృక్పథాన్ని, ఆలోచనలు లేదా ప్రవర్తనలో స్పష్టమైన మార్పును తీసుకురావడానికి ఈశిక్షణ ఎంతగానో దోహదపడు తుందన్నారు. సంక్రమిత వ్యాధులైన క్షయ (టిబి), కుష్టు (లెప్రసీ), హెచ్ఐవి, బ్రెస్ట్ కౌన్సిల్ తదితర వ్యాధులపై ఎంఎల్‌హెచ్‌పిలు శిక్షణ పొంది, వాటి గురించి ప్రజలలో అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా టిబి డిపిసీ శేషు, డిపిఎస్ రామరాజు, ఎస్ టి ఎల్ ఎస్ నగేష్, వెంకటరావు, చింతపల్లి, జీ కే వీధి మండలాల టిబి సూపర్వైజర్లు ప్రసాద్, అశోక్, ఎస్ టి ఎస్ రహిమాన్, అధిక సంఖ్యలో ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

విశాలాంధ్ర-రంపచోడవరం : ఏజెన్సీలోని మాతృ మరణాలు, శిశు మరణాలు సంభవించ కుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగు తుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం ఏడియం & హెచ్‌ఓతో, గర్భకోస వ్యాధులకు సంబంధించిన రాజమండ్రి, కాకినాడ ప్రభుత్వాసుపత్రులకు సంబంధించిన వైద్యాధికారులతో, ఏఎన్ఎంలతో, సూపర్వైజర్లతో, అంగన్వాడి సూపర్వైజర్లతో, ఆశ వర్కర్లతో ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో మాతృ, శిశు మరణాలు సంభవించిన ఎడల సంబంధిత వైద్యాధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆయన అన్నారు. ఏజెన్సీల్లోని ఎప్పటికప్పుడు ఫీవర్ కేసులు సంభవించకుండా డోర్ టు డోర్ సర్వే చేయాలని ఆయన అన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణీలకు గుర్తించి ఎప్పటికప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించాలని అదేవిధంగా శిశు మరణాలు సంభవించకుండా ఎప్పటికప్పుడు పరివేక్షించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత వైద్యాధికారులను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎడియం&హెచ్‌ఓ జి. శిరీష, వైద్యాధికారులు వినోద్, షాహిన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన కార్తీక ఏకాదశి

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలో ప్రబోధిని కార్తీకఏకాదశి పర్వదినం పురస్కరించుకొని మంగళవారంనాడు భక్తులు భక్తిశ్రద్ధలతో పెద్దఎత్తున నదీస్నానాలు చేసి దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. శ్రీమహావిష్ణువు ఆశీస్సులు తమపై ఉండాలని పూజలు చేశారు. మండల కేంద్రంలో శ్రీవేణుగోపాలస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామిఆలయాల్లో భక్తులు ఎక్కువగా ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పెద్ద ఎత్తునపూజలు చేశారు. ఆలయ అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు తదితర అర్చకులు పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. వాలంటీర్లు సేవలునిర్వహించారు. ఈఆలయానికి ప్రక్కనే సువర్ణముఖినదీ ఉత్తరవైపు ప్రవహిస్తుండడంతో ఇక్కడ కార్తీకమాసంలో లేదా జీవితకాలంలో ఒక్కరోజు స్నానంచేస్తే పుణ్యం పురుశార్థం దక్కుతుందని ఎంతోమంది మహోన్నతులు చెప్పడంతో భక్తులు పెద్దఎత్తున ఇక్కడ నదీస్నానం చేశారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని శ్రీసువర్ణముఖేశ్వర స్వామిఆలయంలో ,శ్రీఆంజనేయ స్వామి ఆలయంలోనూ, గుచ్చిమీ, మరిపవలస, తామరకండి, కాసాపేట, బూర్జ, నిడగల్లు, గెద్దలుప్పి తదితరగ్రామాల్లో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సువర్ణముఖి నది పరివాహక ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున నది స్నానం చేశారు. ఇదిలా ఉండగా మండలంలోని అచ్చయ్యపేటలో గల ఎన్ సి ఎస్ చక్కెర కర్మాగారం ఆవరణలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయము కూడా భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుండి మధ్యాహ్నం వరకు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని పూజించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఇక్కడ శ్రీనివాసాచార్యులు, పవన్ ఆచార్యులు పూజలు నిర్వహించారు.

మానసికోల్లాసానికి క్రీడలు అవసరం

విశాలాంధ్ర-చింతూరు : క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వం తో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ పేర్కొన్నారు. ఈ నెల14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఆటల పోటీలను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ హైస్కూల్ విద్య భవిష్యత్తుకు కీలకమైందని లక్ష్యాలు సాధించాలంటే మానసిక ఉల్లాసం, స్థైర్యం ఎంతో అవసరమన్నారు. క్రీడలు ఇందుకు ఉపయుక్తమన్నారు. అలాగే ప్రస్తుత కాలంలో యువత చెడు అలవాట్లతో భవిష్యత్తుని నాశనం చేసుకుంటున్నారని వాటి పట్ల జాగరూకతతో ఉండాలన్నారు. మనసు కలుషితం కాకుండా ఉండేందుకు చక్కని విద్యనభ్యసిస్తూ క్రీడల వైపు దృష్టి పెట్టాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఏ రమేష్‌తో పాటు ఉపాధ్యాయులు స్వాతి, నాగరాజు, సుజాత, సుబ్బయ్య, రాజు, రత్తయ్య, భద్రయ్య శ్రీనివాస్, ప్రసాద్, జయ, మహాలక్ష్మి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలి : వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కరుణ



విశాలాంధ-పార్వతీపురం : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేరోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ వైద్యులకు సూచించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రజల ఆరోగ్య ప్రమాణాలు ప్రధానమైనవని స్పష్టం చేశారు. జిల్లాలో తప్పకుండా వైద్య ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇక్కడ సికిల్ సెల్, తలసేమియా, అనీమియా, పిల్లల ఆరోగ్యం, సంక్రమించే వ్యాధులు, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో రోగులకు అందించాల్సిన వైద్య సేవలపై ఆమె వైద్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రోగులకు అందిస్తున్న ఆరోగ్యసేవలు మరింత మెరుగుపడాలని అన్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ప్రాథమిక,సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగిని పలకరించి, వివరాలు తెలుసుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి ఇంటికి వెళ్లే వరకు పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. రోగి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లాలని చెప్పారు. తొలుత ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, మందులు, పరికరాలు, సిబ్బంది సమర్థత వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆమె అవసరమైన మెరుగుదలకు సంబంధించిన సూచనలు చేశారు. ఈ సమావేశం ద్వారా జిల్లా ప్రజలకు మరింత నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడానికి అవసరమైన చర్యలు వైద్యులు చేపట్టాలని తెలిపారు. ఆసుపత్రుల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించి, జిల్లాలో ఆరోగ్య రంగంలో మరింత సమర్థవంతమైన సేవలను అందించేందుకు సహకరిస్తామన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉందని, కొత్త జిల్లా కావడంతో పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు లేవన్నారు. అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలతో రోగులకు సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రక్తహీనత లోపం ఎక్కువగా ఉందని, దీని నివారణకు మెడికల్ బృందాన్ని ఏర్పాటుచేసి పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 108, అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయని, అత్యవసర పరిస్థితిల్లో కేజీహెచ్, విజయనగరం ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఆసుపత్రులకు పడకలు పెంచాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నట్లు చెప్పారు. చాలావరకు మాతా శిశు మరణాలను నివారించగలిగామని కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక, సామాజిక ఆసుపత్రుల ద్వారా జిల్లాలో అందిస్తున్న వైద్య సేవలు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషనర్‌కు వివరించారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.కె.విజయపార్వతీ, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా. ఎం.వినోద్, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక, సామాజిక ఆసుపత్రుల మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విజయవంతం చేయండి

విశాలాంధ్ర-బెలగాం : ఉత్తరాంధ్ర కరువు, వలసలు-విద్య, ఉపాధిరంగ సమస్యలు-కర్తవ్యాలు అనే అంశంపై జరిగే ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును, విద్యార్థి, యువకులు, మేధావులు విజయవంతం చేయాలని పార్వతీపురం జూనియర్ కాలేజీ వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్ ను పిడిఎస్ఓ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ఓ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి పి. సోమేశ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అన్ని పాలకవర్గ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్రను కావాలని అభివృద్ధి చేయని కారణంగానే ఈ రెండు ప్రాంతాల్లోనూ వలసలు అధికమవుతున్నాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం అమలు చేయాల్సిన విభజన హామీలను వేటిని కూడా అమలు చేయలేదని, విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు కేటాయించిన విశాఖ రైల్వే జోన్ ను, సెంట్రల్ యూనివర్సిటీని, విద్యాసంస్థలకు నిధుల కేటాయింపు వంటి హామీలను అమలు చేయాలని, మూతపడ్డ జూట్, చక్కెర తదితర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెరిపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే విరమించి సొంత గనులను కేటాయించాలని, ప్రైవేటీకరించిన ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వమే కొనసాగించాలని, ఉత్తరాంధ్రలో విచ్చలవిడిగా యువతకు అందుబాటులో ఉంటున్న గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, వలసలను అరికట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ, విజయనగరంలో జరగబోయే ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సుకు ప్రారంభకులుగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. డి.వి.జి శంకరరావు ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వక్తలుగా కేంద్ర-రాష్ట్ర మాజీ సలహాదారు వైవిఎస్ మహదేవన్, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. భానుమూర్తి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ సభ్యులు స్వామి, వాసు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు భేష్

మరింత మెరుగైన సేవలకు సహకారం అందిస్తాం

వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కరుణ



విశాలాంధ్ర-బెలగాం : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు భేషుగ్గా ఉందని, మరింత మెరుగైన సేవలు అందించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ తెలిపారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన నేపథ్యంలో మంగళవారం ఉదయం స్థానిక జిల్లా ఆసుపత్రితో పాటు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంసిహెచ్, ట్రైబల్ సెల్ నందు రోగుల వివరాలను నమోదు ప్రక్రియను పరిశీలించి రిఫరల్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి కేసులు లేకపోవడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ట్రైఏజ్, హెచ్డీయు, లేబర్, ఎంఓటీ, ఆపరేషన్ థియేటర్, సర్జికల్, పిడియాట్రిక్, న్యూబోర్న్, కంగారు మాతృ సంరక్షణ యూనిట్లను సందర్శించి పరిశీలించారు. పసిపాపను ఎత్తుకొన్న బాలింతలను ఆసుపత్రిలో అందుతున్న వసతులపై అడిగి తెలుసుకున్నారు. తదుపరి జిల్లా బాలల సంరక్షణ చికిత్స కేంద్రాన్ని సందర్శించి, అక్కడ వివిధ విభాగాలను తనిఖీ చేశారు. వివిధ లోపాలు గల చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలను తిలకించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని, ఇంకా మెరుగైన సేవలు అందించాలని ఆమె వైద్యులను కోరారు. ఇందుకు ప్రభుత్వపరంగా అందించాల్సిన పరికరాలు, సదుపాయాలు, వసతుల కల్పనకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. జిల్లాలో రక్తహీనతతో హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మాతా, శిశు మరణాలు లేకుండా వైద్యులు చూడాలని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. విజయపార్వతి, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా. మంతిని వినోద్ కుమార్, ఏరియా, బాలల సత్వర చికిత్స ఆసుపత్రుల మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిర్సాముండ జయంతి ఉత్సవాల విజయవంతానికి విస్తృత ప్రచారం : ఆదివీసీ సంక్షేమ పరిషత్



విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ చింతూరు మండలం చదలవాడ పంచాయతీలో తులసిపాక గ్రామంలో నవంబర్ 15న జరిగే బిర్సా ముండా జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఆటోలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం చిన వీరభద్రం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బిర్సా ముండ జయంతి ఉత్సవాలను ప్రతి గ్రామ గ్రామాన నిర్వహించాలని ప్రభుత్వాని కోరారు. అదే రోజు నిర్వహించతలపెట్టిన కోయ పూర్వం గ్రామ పెద్దల సదస్సు కొరకు చదలవాడ కొత్తపల్లి గూడూరు మోతుగూడెం తదితర గ్రామపంచాయతీలో గ్రామ పెద్దలను ఈసదస్సుకు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలానే ఐదో షెడ్యూల్ లోనీ గ్రామాలకు ప్రత్యేకమైన పరిపాలన వ్యవస్థ ఉందని ఆ వ్యవస్థను పరిరక్షించే గ్రామ పెద్దలకు పూజారులకు గౌరవ వేతనం రూ.10వేల రూపాయలు చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అలాగే చదలవాడ, గూడూరు కొత్తపల్లి, మోతుగూడెం పంచాయతీలకు సంబంధించి రైతులకు సోకిలేరు ,సీలేరు పైన ఉన్నటువంటి లిఫ్ట్ ఇరిగేషన్ లను రిపేర్ చేసి ఈ ప్రాంత ప్రజలకు వ్యవసాయం పైన మరింత అభివృద్ధి చెందేలా చూడాలని ,దీనివలన సుదూర ప్రాంతాలకు వలస వెళుతున్న వారి సంఖ్య తగ్గుతుందన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాలలో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పన కోసం ప్రత్యేకమైన "ఉద్యోగ నియామక చట్టాన్ని తీసుకురావాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని షెడ్యూల్ ప్రాంతాలైన తూర్పుగోదావరి పశ్చిమగోదావరి అల్లూరి సీతారామరాజు మన్యం శ్రీకాకుళం జిల్లాలలో ఉన్న ఐటీడీఏలకు ప్రత్యేకమైన డీఎస్సీ ద్వారా ఆ ప్రాంతంలోని స్థానిక ఆదివాసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని అలానే అన్ని డిపార్ట్మెంట్లోనూ స్థానిక ఆదివాసి నిరుద్యోగులతోనే ఉపాధి కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అలానే 1/70 చట్టం, పీసా చట్టం అమలుజరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా శ్రీను, పోడియం లక్ష్మణరావు, సోడి రాఘవయ్య,కారం శంకురమ్మ, నూప సరేంద్ర, కట్టం రామకృష్ణ, బొడ్డు బలరాం, పూనెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుతూ పర్యాటకాన్ని ఆస్వాదించండి



ఈవోపిఆర్ అండ్ ఆర్‌డి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-చింతపల్లి : పర్యావరణాన్ని కాపాడుతూ పర్యాటకాన్ని ఆస్వాదించాలని స్థానిక ఈవోపిఆర్ అండ్ ఆర్‌డి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఆంధ్ర కశ్మీర్ గా పేరొందిన లంబసింగి, తాజంగి సహా పెదబరడ పంచాయతీలలో ఉన్న రిసార్ట్ ల యజమానులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ పర్యాటకులను ఆకర్షించేలా సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా నిషేధించాలని, రిసార్ట్‌ల ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ వ్యర్థ పదార్థాలు వేయకుండా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, అదే క్రమంలో వచ్చిన పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా వారు వచ్చిన వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎస్సై రమణ మాట్లాడుతూ రిసార్ట్స్ యజమానులు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వచ్చిన పర్యాటకుల వివరాలు ఆధార్ కార్డు సహా అన్ని వివరాలు ఉండేలా రికార్డులు మెయింటినెన్స్ చేయాలని, వచ్చిన పర్యాటకులు తిరిగి వెళ్లేంతవరకు వారి కదలికలను గమనించాలన్నారు. అనుమానితులు ఎవరైనా రిసార్ట్‌లలో ఉన్న రిసార్ట్స్‌ల చెంత సంచరించినట్లు అనుమానం కలిగితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. తహసిల్దార్ రవికుమార్ మాట్లాడుతూ రిసార్ట్ ల నిర్వహణపై అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాలను వివరించారు. అదేవిధంగా రిసార్ట్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు కామేశ్వరరావు లేవనెత్తిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రిసార్ట్స్ యజమానులు పలువురు మాట్లాడుతూ కొంతమంది రిసార్ట్స్ యజమానులు దారి కాసి పర్యాటకులను తమ రిసార్ట్స్ లకు రావాలని ఒత్తిడి తెస్తున్నారని, దీని వలన మిగిలిన రిసార్ట్స్ లకు పర్యాటకులు రాలేని పరిస్థితి నెలకొంటుందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన అధికారులు రిసార్ట్స్ యజమానులంతా సమావేశం ఏర్పాటు చేసుకొని ఆ సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

క్షేత్రసిబ్బందికి ఎఫ్అర్ఎస్ మినహాయింపు ఇవ్వాలంటూ వినతి

విశాలాంధ్ర-పార్వతీపురం : వైద్య,ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ మినహాయింపు ఇవ్వాలని, జిల్లాలో పనిచేస్తున్న వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల వేతనాలకు ఎఫ్ఆర్ఎస్ ను లింకుచేయకుండా వేతనాలను చెల్లింపులు చేయాలని కోరుతూ పార్వతీపురం మండలం జిల్లా ఎన్జీవో అధ్యక్షులు జీవిఆర్ఎస్ కిషోర్ వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ కరుణకు వినతిపత్రాన్ని అందజేశారు. దీంతోపాటు జాతీయ వైద్య మిషన్ సిబ్బందికి అక్టోబర్ నెల వేతనాలను చెల్లింపులు చేయాలని కోరారు. జిల్లాలో రెండురోజుల పర్యటనకు విచ్చేసిన ఆమెకు వినతిపత్రం అందజేసి పలుసమస్యలను తెలియజేయగా సానుకూలంగా స్పందించారని కిషోర్ ఆయనతోపాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఖండ్రుమ్‌లో పొలం పిలుస్తుంది



విశాలాంధ్ర -దుంబ్రిగుడ: మండలంలోని ఖండ్రుమ్ పంచాయతీ గ్రామాల్లో స్థానిక సర్పంచ్, పోరంల మండల అధ్యక్షుడు కే.హరి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సిబ్బంది పంట పొలాల్లో నూతన పద్ధతి ద్వారా అధిక దిగుబడి వచ్చే విధంగా వ్యవసాయం సాగు చేసే విధానంపై గిరి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హరి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సలహా సూచనలు తీసుకుని రైతులు పంటలను పండించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి, సిబ్బంది పురుషోత్తం, ఐ సి ఆర్ పిలు, రైతులు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలుచేయాలి : ఏటిడబ్ల్యూఓ కృష్ణమోహన్

విశాలాంధ్ర-గంగవరం : ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని సహాయ గిరిజన సంక్షేమ అధికారి కే కృష్ణమోహన్ సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశా ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతను సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనారోగ్యంగా ఉన్న విద్యార్థులను గుర్తించి ఎప్పటికప్పుడు వారికి వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. శానిటేషన్, ఆరోగ్యం పట్ల ప్రమాదంగా ఉండాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడుఆర్ వి వి సత్యనారాయణ,డిప్యూటీ వార్డెన్,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల డెవలప్మెంట్‌పై అధికారులకు శిక్షణ : ఎంపీడీవో ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : గ్రామ పంచాయతీ పరిధిలోగల గ్రామాల్లో అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సీఈఓలు, వివిఎలుకు శిక్షణ నిర్వహించడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి ఎస్ కె వి ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్ కెవి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందేందుకు పక్కాగా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులను అందరి సమక్షంలో చర్చించి నిర్ణయించాలని ఆయన సూచించారు. బడ్జెట్లో కేటాయించిన నిధులతో ఏ పనులు కు ఎంత పర్సంటేజ్ కేటాయించాలో తెలియజేశామని అన్నారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాంబాబు ఏటిడబ్ల్యూ క్రాంతి కుమార్ ఐసిడిఎస్ పిఓ విజయ కుమారి, ఎస్ఎంఐ జెఈ రామకృష్ణ ఆర్డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు అలాగే వెలుగు ఏపిఎమ్, ఎన్.ఆర్.ఇ.జి. ఎస్ ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీల వసతి గృహాల్లో సేవలు బాగున్నాయి

వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వి.కరుణ

విశాలాంధ్ర-సాలూరు : స్త్రీల వసతి గృహాల్లో వైద్య సేవలు, సదుపాయాలు బాగున్నాయని వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా సాలురులోని ఐటిడిఏ వైటిసి భవనంలో గల గర్భిణీ స్త్రీల వసతి గృహాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. అక్కడ గర్భిణీ స్త్రీలకు అందుతున్న సదుపాయాలు, వేక్సిన్లు గురించి అడిగి తెలుసుకొని పండ్లను పంపిణీ చేశారు. తమకు ఎటువంటి సమస్యలు లేవని, సమయాను కూలంగా అన్ని సదుపాయాలు అందుతున్నట్లు గర్భిణీలు కమిషనర్ కు తెలిపారు. సాలూరు, కురుపాం, గుమలక్ష్మిపురం ప్రాంతాల్లో ఇటువంటి వసతి గృహాలను నిర్వహించడం పట్ల కమిషనర్ సంతోషం వ్యక్తం చేశారు. అదనపు వసతి గృహాలపై ఆమె ఆరా తీశారు. వసతి గృహంలో కొన్ని సమస్యలు ఉన్నాయని మీడియా ప్రతినిధులు కమిషనర్ కు తెలియజేయగా నిధులు అందుబాటులో ఉన్నాయని, అన్నింటిని పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. తొలుత పార్వతీపురం మండలం ఎం.ఆర్.నగర్ లోని గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.కె.విజయపార్వతీ, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా. ఎం.వినోద్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డా. కె.అప్పారావు, వసతి గృహ మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎకో ఫ్రెండ్లీ టూరిజంపై సమీక్ష

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు పారిశుద్ధ్యం మరియు ఏకో ఫ్రెండ్లీ టూరిజం పై సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ తెలిపారు. సోమవారం జరిగిన ఈ సమావేశంలో మండలంలో కార్యదర్శులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మండలంలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని గుర్తించి పర్యాటక ప్రాంతాలలో పారిశుధ్యం పై కార్యదర్శులు దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా రిసార్ట్స్ హోటల్స్ కిరాణా షాపులు లలో తప్పనిసరిగా డస్ట్ బిన్ లో ఏర్పాటు చేయాలన్నారు దీనికి గాను పంచాయతీ నుంచి ఏర్పాటు చేసి యూజర్ చార్జీలు వసూలు చేసి పంచాయతీకి ఆదాయం కల్పించాలని ఆదేశించారు ఏకో ఫ్రెండ్లీ టూరిజం లో భాగంగా ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ బాటిల్స్ వాడకుండా కేవలం జ్యూట్ బ్యాగ్స్ ఇస్తరాకుల చేసిన ప్లేట్లు మాత్రమే ఉపయోగించాలని అందువల్ల పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని ఆదేశించారు పర్యాటక ప్రాంతాలలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరిచి అదనపు పారిశుధ్య కార్మికులను నియమించి క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచాలని తెలిపారు ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు సక్రమంగా అమలు జరిగేలా ప్రతి శనివారం మరియు ఆదివారం సచివాల సిబ్బందికి విధులు కేటాయించాలని ఎంపీడీవో ఆదేశించారు.

కొత్త వరిపంటపై తుంబలిలో క్షేత్ర దినోత్సవం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని తుంబలిలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞానకేంద్రం-రస్తా కుంటుబాల వారు వరి రకం బిపిటి 2841 క్షేత్ర దినోత్సవం జరిపారు. దీనిపై క్షేత్ర దినోత్సవం జరిపినట్లు సమన్వయకర్త డా. ఎస్.ధృవ, డా. స్రవంతి, డా.అనంత విహారిలు తెలిపారు. ఈరకం నల్లబియ్యం ఎంటియు 7029, ఐఆర్‌జిసి 18195, ఎంటీయు 1081అనే రకాల సంకరం ద్వారా అభివృద్ధి చేయబడిందన్నారు. ఈరకం వరి 130-135రోజుల కాల పరిమితి కలిగి హెక్టారుకు5-6 టన్నుల దిగుబడినిస్తుందన్నారు. మధ్యస్థ సన్నంగా ఉండిఉడికించినప్పుడు ముద్దగా కాకుండా పొడిపొడిగా ఉంటుందన్నారు. పోషక విలువలు పరంగా కూడా ఉత్తమమైనదన్నారు. జింకు ఐరన్ వంటి సూక్ష్మ పోషకాలతో పాటు శరీరానికి అవసరమైన లైసిన్ వేలిన్ వంటి అమైనో యాసిడ్లు కూడా ఎక్కువగా ఉన్నాయని, దీనిని ఆహారంగా తీసుకోవడం వల్ల వివిధ పోషకాలు ఎక్కువగా లభించడమే కాక మధుమేహ రోగులలో కూడా రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు హెచ్చు తగ్గులు లేకుండా స్థిరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20 మంది రైతులు మండల వ్యవసాయ అధికారి టీ జ్యోత్స్న, అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐను మర్యాదపూర్వకంగా కలిసిన విలేకరులు!

విశాలాంధ్ర-జీకే వీధి: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన వర ప్రసాద్ ను గూడెం కొత్త వీధి పత్రిక విలేకరుల సంఘం అధ్యక్షుడు సాయం రమణ ఆధ్వర్యంలో విలేకరులు అందరూ మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను స్వాగతించారు. గిరిజన ప్రాంతంలో పోలీస్ గిరిజనుల మధ్య మైత్రి పూర్వక సంబంధాలు ఉన్నాయని తాను కూడా ఆ మేరకు పనిచేస్తూ ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని సీఐ అన్నారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండలంలో శాంతిభద్రతల నెలకొల్పే కార్యక్రమంలో భాగంగా పత్రికా విలేకరుల సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందించాలని ఆయన కోరారు. తమ పోలీస్ శాఖ నిరంతరం ప్రజల అభివృద్ధి అభ్యున్నతి ప్రజా సంక్షేమం శాంతి భద్రతల ఏర్పాటు వంటి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టడం జరుగుతుందని అలాగే మండలంలోని మారుమూల గ్రామాలు లో ఎటువంటి సమస్యలు ఏర్పడిన తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చొరవ చూపిస్తామని ఆయన అన్నారు వెనుకబడి ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తమపై ఉందని అధికారుల సహాయ సహకారాలతో పోలీస్ శాఖ చేపట్టాల్సిన కార్యక్రమాలు అన్ని చేపట్టడం జరుగుతుందని సీఐ వరప్రసాద్ తెలిపారు ఈ కార్యక్రమంలో గూడెం కొత్త వీధి ఎస్సై అప్పలసూరి విలేకరుల సంఘం అధ్యక్షుడు ఎస్ రమణ, ఎస్.లక్ష్మణ్, ఎస్.లక్ష్మణ్‌బాబు, ఎస్.విజయ్, బి.ధారబాబు, జి.చిన్నారావు, లక్ష్మణ్, జి.హనుమంతరావు, ఎస్ శివ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఎన్నిక

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్నటువంటి యావన్మంది మాదిగలు కలసి మండల కేంద్రమైన రాజవొమ్మంగిలో ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర కోస్తా జిల్లాల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ మాట్లాడుతూ మాదిగలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఏజెన్సీలోని మాదిగలకు ఏ ప్రభుత్వం వచ్చినా న్యాయం జరగటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరియు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ అన్న 30సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసి ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగ జాతి అందించే దిశగా ముందుకు సాగుతున్నారు,ఇదే సమయంలో అల్లూరి జిల్లాలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు,జిల్లా అధ్యక్షులుగా మోర్త బుజ్జి బాబు, రాష్ట్ర కార్యదర్శిగా నిడమర్తి చినబాబు, మండల కన్వీనర్‌గా పెదడ నూకరాజును నియమించారు. ఈ కార్యక్రమానికి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బోదపాటి కామరాజు, గుండెపల్లి జీవరత్నం, పిల్లి కిరణ్, ఐనవిల్లి తాతారావు, కోరుబిల్లి నూకరాజు,పెదపూడి లోవరాజు, మోర్తా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి లోకేష్‌ని కలిసిన రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

విశాలాంధ్ర-అనంతగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో నూతన జీసీసీ చైర్మన్ కిడారి. శ్రావణ్ కుమార్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆంధ్ర రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ని మర్యాదపూకముగా కలిశాన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ మాట్లాడుతూ జీసీసీ సంస్థను అభివృద్ధి చేస్తానని గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కాపాడుతూ జీసీసీ అభివృద్ధి కి కృషి చేస్తానని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. నాకు జీసీసీ చైర్మన్ నియమెంచేనందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిని జర్తా సత్యవతి తెలిపారు. 14న వారోత్సవాలు ప్రారంభం, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17న రచయితల సందేహాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు, 18న వకృత్వం, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న ముగింపు వేడుకలు జరుగుతాయని, విద్యారులు తల్లి తండ్రులు హాజరు కావాలని కోరారు.

నిడగల్లును సందర్శించిన ఏపీ ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రాం ఆఫీసర్

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని మెడికల్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఏపీ ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ సందర్శించారు. సందర్శనలో బాగంగా, ఆరోగ్య కేంద్రంలో అమలుచేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలని, రికార్డులను, నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గ్రామంలో వైద్య పరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరితోపాటు క్లస్టర్ ఇంచార్జి డాక్టర్ విజయమోహన్, ఆయుష్మాన్ భారత్ కోఆర్డినేటర్ రెడ్డి, ఈఓ సూర్యనారాయణ, హెచ్‌వి వరలక్ష్మి, హెచ్ఎస్ గోపాలరావు, ఎంఎల్‌హెచ్‌పి ధరణి, ఆరోగ్య సహాయకుడు, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు ప్రజలు సహకరించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణంలో ప్లాస్టిక్ నివారణకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజులు అన్నారు. మంగళవారం పట్టణంలో స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల వాతావరణంలో మార్పులు ప్లాస్టిక్ సంచులు వాడడం వలన అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత సంచులను వినియోగించాలని ప్రజలు బాధ్యత వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ కెవిపి రాజు,ఏఎస్ఓ వీరి నాయుడుశానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను సిడిపిఓ తనిఖీ

విశాలాంధ్ర-కొయ్యూరు: గాదిగుమ్మి, పెద్దమాక వరం, చుట్టు బంధ అంగన్వాడీ కేంద్రాలను సిడిపి ఓ.పి.విజయ్‌కుమారి తనిఖీ చేయగా మండలంలోని మారుమూల ప్రాంతాలైన టీటోరాల వీధి, ఆర్. దొడ్డరాం కేంద్రాలను సూపర్వైజర్ కనకమహాలక్ష్మి తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో వర్కర్లు హెల్పర్లు ప్రత్యేక దృష్టి సారించి స్థానికుల సహాయంతో కిచెన్ గార్డెన్‌లను విధిగా ఏర్పరచుకోవాలని తద్వారా గర్భిణీలకు, బాలింత లకు, పౌష్టికాహారం లేబ్యమవుతుందని సిడిపిఓ పి.విజయకుమారి తెలిపారు. అలాగే పెదనాపురం కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు టేక్ హోమ్ రేషన్ సిడిపిఓ చేతుల మీదుగా అందించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల నుండి సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

పొంచిఉన్న ప్రమాదం



విశాలాంధ్ర-బలిజిపేట : మండల ప్రధాన కేంద్రం నుండి నారాయణపురం వెళ్లే రహదారి మధ్యలో శిథిలావస్థలో అంకలాం నీటికాలువపై నిర్మించిన కన్వర్టర్ కాలువ తవ్వకాలు జరిగినప్పుడు 1984లో నిర్మించిన కన్వర్టర్ అని,సుమారు పది సంవత్సరాల నుండి శిథిలావస్థలో ఉన్నప్పటికీ నిర్మాణము జరగలేదని ప్రజలు తెలియజేస్తున్నారు. నిత్యము వాహనములు, బస్సులు, లారీలు, ఆటోలు ప్రయాణం చేస్తుంటారని రాత్రింబవళ్లు ప్రయాణం చేస్తారని ఆదమరిచి, నిర్లక్ష్యముగా ప్రయాణం చేస్తే ప్రమాదము జరుగుతుందని మండల ప్రజలు తెలిపారు. అధికారులు స్పందించి ప్రమాదం నివారించడానికి అంకలాం కాలువపై కన్వర్టర్ ను నిర్మించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏమి లాభం ఈకొత్త జిల్లా వలన..?

- జిల్లా ఏర్పాటు అనంతరం పెరిగిన కష్టాలు
- జిల్లా కేంద్రానికి ఒక బస్సు కూడాలేని వైనం

విశాలాంధ్ర-కూనవరం : పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టయింది విలీన మండలాల ప్రజల పరిస్థితి. పాలనా సౌలభ్యం కోసం అంటూ గత ప్రభుత్వం విలీన మండలాలను తూర్పుగోదావరి నుంచి విడదీసి అల్లూరి సీతారామరాజు జిల్లా అని పాడేరు కేంద్రంగా ఏర్పాటు చేసింది. అంతకుముందు తూర్పుగోదావరి జిల్లాగా ఉన్నప్పుడు రాజమండ్రి గాని కాకినాడ గాని రాకపోకలకు కొంత సౌకర్యంగా ఉండేది. ఈ కొత్త జిల్లా ఏర్పాటుతో జిల్లా కేంద్రంతో విలీన మండలాలకు సంబంధాలు దాదాపు తెగిపోయాయి.జిల్లా కలెక్టర్ దగ్గరలో ఉంటే గ్రామాల్లో పనిచేసే అధికారులు సైతం మరింత బాధ్యతగా ఉంటారనేది ఎవరు కాదనలేని నిజం. ఇక్కడ ప్రజలు కలెక్టర్ దగ్గరికి పోలేరు, రాలేరు అని తెలిసి చాలామంది అధికారులు విధులకు యథేచ్ఛగా గైర్హాజరవుతున్నారు. ఇక ఆర్టీసీ జిల్లా కేంద్రానికి తిరిగే ఒకేఒక బస్సును కూడా తీసేసింది. మొత్తంగా జిల్లాల పునర్విభజన కారణంగా ఎక్కువగా నష్టపోయింది విలీన మండలాల ప్రజలే. సుమారు 300 కిలోమీటర్ల దూరం జిల్లా కేంద్రం ఉండడమే ఒక శాపం అయితే అక్కడికి వెళ్ళడానికి బస్సుకూడా లేకపోవడం మరీ దుర్భరం. తెలుగుదేశం అధికారంలోకి రాగానే ఇక్కడ ప్రజల అవసరాలకు అనుగుణంగా పోలవరం జిల్లా చేస్తానన్న చంద్రబాబు హామీ హామీగానే ఉంది తప్ప కార్యారూపం దాల్చలేదు. పోలవరం ప్రాజెక్టు కోసం ఈ నాలుగు మండలాల ప్రజల్ని ఆంధ్రాలో కలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబే ఇక్కడ ప్రజల కనీస అవసరాలను తీర్చే బాధ్యత తీసుకోవాలని, ప్రజల సౌకర్యం కోసం అధికారులు అందుబాటులో ఉండేలా ప్రజలు విరివిగా అధికారుల దగ్గరికి వెళ్ళగలిగేలా చూడాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.

గిరిజన విద్యార్థి మృతిపై రీ-ఎంక్వైరీ నిర్వహణ

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని రావాడ రామభద్రపురంలో ఏడవ తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ మృతిపై మంగళవారం మరోసారి రీఎంక్వయిరీ జరిగింది. ఈవిద్యార్థి ఈనెల 6న మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై ప్రజాసంఘాలతో పాటు రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఆందోళన వ్యక్తం చేస్తూ రీ ఎంక్వయిరీ జరపాలని కోరడంతో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అసుతోష్ శ్రీనివాస్తవ దీనిపై కమిటీ వేశారు. జిల్లా ఆరోగ్యశాఖఅధికారి డాక్టర్ కె వి ఎస్ పద్మావతి,ఐటీడీఏ డిడి మహమ్మద్ ఉద్దీన్ గయాజుద్దీన్, డిప్యూటీ డిఇఓ పిసిహెచ్ మోహనరావు, మండల తహసీల్దార్ రెడ్డి పకీరు, ఏటిడబ్ల్యూఓ చంద్రబాబు మంగళవారం వచ్చి ఏమి జరిగిందనే విషయంపై పూర్తి దర్యాప్తు నిర్వహించారు.తరువాత సహ విద్యార్థులు నిమ్మక సుధీర్,మండంగి సిద్దు, నిమ్మక సామ్యూల్, కే పవన్ కుమార్, కొండ గొర్రె ప్రేమ్ కుమార్‌లను కూడా పిలిచి విచారించారు. వారివద్ద నుండి వ్యక్తిగత విచారణ పత్రాలు తీసుకున్నారు. తర్వాత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.తిరుపతి, డిప్యూటీ వార్డెన్ ఎల్, గణపతిరావు, ఆఫీస్ సవారినేట్ సిహెచ్ వెంకటేశ వద్ద స్టేట్మెంట్ తీసుకున్నారు. దీనిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంఇస్తూ పూర్తి నివేదికను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అసుతోష్ శ్రీవాస్తవకు అందజేస్తామని దర్యాప్తు బృందం తెలిపింది.

రోడ్డు ప్రమాదాల అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి డి.రామగోపాల్ తెలిపారు. అవగాహన కార్యక్రమాలను, ర్యాలీ లను స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రవాణా శాఖ సిబ్బంది సహకారంతో ఈనెల 12వ తేది నుండి 14వ తేది వరకు జిల్లాలో సాలూరు, పాలకొండ, పార్వతీపురం, కురుపాం శాసన సభ నియోజక వర్గాల పరిధిలో చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. రోడ్డు ప్రమాదాల నిర్వహణలో భాగంగా శిరస్త్రాణం అవశ్యకత తెలియజేస్తూ స్థానిక ప్రజలకు, యువతకు అవగాహన ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను వివిధ ప్రదేశాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 12వ తేదీన సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మధ్యాహ్నం 3 గంటల నుండి కార్యక్రమం జరుగుతుందని, 13వ తేదిన ఉదయం 9 గంటలకు పాలకొండ ప్రభుత్వ బాలికల కళాశాలలో, మధ్యాహ్నం 3 గంటలకు పార్వతీపురం కలెక్టరేట్ ఆవరణ నుండి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 14వ తేదిన కురుపాం మండలం గొటివాడ గ్రామంలో ఉదయం 10 గంటలకు రహదారి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆ ప్రకటనలో వివరించారు.

తెర్లి రవికుమార్‌కు సిబ్బంది అభినందనలు

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న తెర్లి రవికుమార్ జూనియర్ లెక్చరర్ (ఎకనామిక్స్)కి గురుబ్రహ్మ స్టేట్ అవార్డు 2024 వచ్చిన సందర్భంగా డిఐఈఓ డి. మంజులా వీణ, ప్రిన్సిపాల్ జె.రామారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. వీరు చిన్నప్పటినుండి సోషల్ సర్వీస్ ఆక్టివిటీస్ లో పాల్గొనడమే కాకుండా పేద విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్, స్టడీ మెటీరియల్, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ద్వారా పలు సేవా కార్యక్రమలు చేశారు. 2013లో ఉమ్మడి విజయనగరం జిల్లా కలెక్టర్ చే డిస్ట్రిక్ట్ అవార్డు అందుకున్నారు. అలాగే ఈ కళాశాలలో ఆరో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదివి ఈ కళాశాలలో జూనియర్ లెక్చరర్ గా పనిచేయడం చాలా గర్వకారణంగా ఉందని ఆయన తెలియజేశారు. వీరు చేస్తున్న కార్యక్రమాలు గుర్తించి విశాఖపట్నం మదర్ తెరిసా సోషల్ ఆర్గనైజేషన్ వారు 2024 గురుబ్రహ్మ స్టేట్ అవార్డు ఇచ్చారు. వారు గుర్తించినందుకు మదర్ తెరిసా సోషల్ సర్వీస్ వారికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

పశు గణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చంద్రశేఖర్

విశాలాంధ్ర-చింతపల్లి : దేశవ్యాప్తంగా ఈనెల ఒకటి నుంచి 21వ పశు గణన సర్వే జరుగుతుందని, ఇందులో భాగంగా అల్లూరి జిల్లాలో కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని చింతపల్లి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చంద్రశేఖర్ అన్నారు. అఖిల భారత పశు గణనకు సంబంధించి మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల వద్ద పనిచేయు పశు వైద్య సహాయకులను ఎన్యూమరేటర్లుగా నియమించడం జరిగింది అన్నారు. వారి పరిధిలోని కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే ద్వారా వివరాలు సేకరిస్తారన్నారు. జనాభా సర్వే వలె ఐదేళ్లకు ఒకసారి సమగ్ర పశుగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనివలన పశువులు గల కుటుంబాల ఉత్పాదక శక్తి ఏ విధంగా ఉందో తెలుస్తుందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 42 మినీ గోకులం (గోశాలలు) మంజూరు అయ్యాయన్నారు. గోసాలల నిర్మాణానికి సంబంధించి లక్ష 11 వేల రూపాయలు కాగా 90% రాయితీపై ఈ గోకులాలు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. రైతు వాటాగా 11వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన లక్ష రూపాయలు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రాయితీ లభిస్తుందన్నారు. 2025 ఫిబ్రవరి 28 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మేకలు గొర్రెలకు పాముల మందు పట్టడం జరుగుతుందని, మేకలు, గొర్రెలు ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు

జల ఉత్సవంలో నీటి పరీక్షలు : ఎంపీడీవో

విశాలాంధ్ర-గంగవరం : ప్రభుత్వం చేపట్టిన జల ఉత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో మంచినీటిని పరీక్షల చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షితమైన మంచినీరు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. దీనిలో భాగంగానే మంచినీటి పరీక్షలు వహించడం జరుగుతుందన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించి, విద్యార్థులకు హ్యాండ్ వాష్ గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ప్రకాష్, గ్రామీణ నీటి తరఫురా శాఖ ఏఈ, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఆర్ వరలక్ష్మి, ల్యాబ్ కెమిస్ట్, బయాలజిస్ట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీని కలిసిన పంచాయతీ నూతన కార్యదర్శులు

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండలంలో సోవ్వా, కంద్రుమ్, అరమ, కొల్లా పుట్టు, కొర్ర, కించు మండ,గసభ, తదితర పంచాయతీల్లో నూతనంగా నియమితులైన పంచాయతీ కార్యదర్శులు మంగళవారం స్థానిక ఎంపీపీ బాకా ఈశ్వరి నివాస గృహంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలసి పుష్ప గుచ్చం అందజేసి, సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నూతనంగా నియమితులైన పంచాయతీ కార్యదర్శులు గిరిజన ప్రాంతంలో అంకితభావంతో పనిచేసి గిరిజనులకు సేవ చేసి పంచాయతీలను అభివృద్ధి పరిచేందుకు తోడ్పాటు నివ్వాలని ఆమె సూచించారు. పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యల సుధా, గురుమూర్తి, విజయ్ కుమార్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాక సింహాచలం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాలి నడకన సింహాచలం అప్పన్న దేవస్థానానికి భక్తులు

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండలంలోని శ్రీశ్రీ వెంకటేశ్వర స్వామివారి భక్తులు విశాఖపట్నం సింహాచలం అప్పన్న దేవస్థానానికి కాలినడకన మంగళవారం బయలుదేరారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ డుంబ్రిగూడ మండల కేంద్రం నుండి సింహాచలం దేవస్థానికి సుమారు 130 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. కాలినడకన సింహాచలం అప్పన్న సన్నిధికి చేరుకుని ఆశయ సాధనకు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు మొక్కుబడిగా ఈ కాలినడకన ప్రయాణం చేస్తున్నామని వారు చెప్పారు. అప్పన్న ఆశీస్సులతో కాలినడుగుతో వెళ్లి దర్శించుకుని పూజలు రెండు రోజుల్లో ముగించుకుని తమ స్వగ్రామనికి చేరుకుంటా మని వారు అన్నారు. ఈ భక్తుల్లో కుమ్మిడిశెట్టి రాజారావు, పల్లెడి. రాజు,అప్పన్న, కొండబాబు, రాములు బయలుదేరారు. వారి ప్రయాణనికి సింహాచలం అప్పన్న దేవుని యొక్క కటాక్షం కలగాలని శ్రీ శ్రీ వెంకటేశ్వర ఆలయ పూజారి ఆకాంక్షిస్తూ దీవించారు. అలాగే మండలంలో గల పలువురు భక్తులు దీవించారు.

భీమవరం గ్రామానికి గ్రామకంఠం గుర్తింపు

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో గుమ్మకోట పంచాయతీ భీమవరం గ్రామంలో గ్రామ కంఠం గుర్తించినట్లు వీఆర్వో కోటి బాబు తెలిపారు. ఇటీవల భీమవరం గ్రామస్తుడు కే రవి భీమవరం గ్రామానికి గ్రామ కంఠం హద్దులు తెలియకపోవడంతో ఇబ్బందిగా ఉందని దరఖాస్తు చేశారని అందుకుగాను మంగళవారం నాడు గ్రామ కంఠం గుర్తించినట్లు తెలిపారు. గ్రామ ప్రజల సమక్షంలో హద్దులు చూపించడం జరిగిందన్నారు. గ్రామంలో ఉండే పాఠశాల, ఆలయలు, అంగన్వాడి కేంద్రం, హెల్త్ సబ్ సెంటర్, జీసీసీ డిపో, వాటర్ ట్యాంక్ వంటే ప్రభుత్వ భవనాలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో కూడా కొలతలు వేసామని తెలిపారు. త్వరలో ఈ కొలతలతో పూర్తిగా నివేదిక తయారవుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో సచివాలయ సర్వేయర్, రెవెన్యూ తలయారి పవిత్ర గ్రామస్తులు రవి, వీరభద్రుడు, కృష్ణ, సీతారాం, చంటి, శ్రీను, సన్యాసి రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు హుకుంపేట-పాడేరు మండలాల సరిహద్దు బ్రిడ్జికి మోక్షం

విశాలాంధ్ర-హుకుంపేట : మండలం అడ్డుమండ గ్రామానికి మరియు పాడేరు మండలం మోధపుట్టు గ్రామానికి మధ్యగల బ్రిడ్జికి పనులు ప్రారంభిస్తున్నామని అడ్డుమండ సర్పంచ్ గుమ్మ శ్యామసుందరం తెలిపారు. సోమవారం గ్రామ ప్రజలతో కలిసి కొబ్బరికాయ కొట్టి ఆయన పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బ్రిడ్జి కూలిపోయి రవాణా సౌకర్యానికి ఆటంకం ఏర్పడి సుమారు 30 నుండి 40 గ్రామాల ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారని ఆయన ఉన్నారు. బ్రిడ్జి నిర్మాణం పనులు పనులు ఎంతకీ జరగకపోవడంతో వాటిక అనుసంధానంగా చిన్న వంతెనను ఏర్పాటు చేయడం జరిగిందని అది కూడా గత రెండు సంవత్సరాల కిందట మరమ్మతులకు గురికావ డంతో ప్రాజెక్టు అధికారి చొరవతో 14లక్షల నిధులు మంజూరు చేశా రని వాటితో పనులు ప్రారంభించా మని పేర్కొన్నారు.ఈ రహదారి వంతెన వలన పాడేరు హుకుంపేట రింగ్ రోడ్డు వలన టూరిస్టులు రాక పోకలు ఎక్కువ రద్దీ గా ఉండే దని అదే కాక ఈ రోడ్డు మీదుగా వైజాగ్ వెళ్లే వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా తక్కువ సమయం ఉండేది అన్నారు .అయితే ఈ బ్రిడ్జి మరమ్మతులు గురి కావడంతో వేరొక బ్రిడ్జి అయినా అడర్ మెట్ట గ్రామం మీదుగా గత్యంతరం లేక ప్రజలు వెళ్లేవారన్నారు. నామమా త్రంగా వేసిన వంతెన కూడా నిర్మా ణానికి నోచుకోకపోవడం వలన ఏ గ్రామ ప్రజలు ఆ గ్రామానికి ఉండ వలసి వచ్చింది అన్నారు. అయితే బ్రిడ్జి పూర్తిస్థాయి నిర్మాణానికి సుమారు 3.50 కోట్ల రూపాయలు ఎంపి నిధుల నుండి మంజూరు చేసిన ఎంపీ డాక్టర్, గుమ్మ తనుజ రాని కి పరిసర గ్రామ ప్రజలు ప్రత్యే క ధన్యవాదాలు తెలియజేశారు. అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్స్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.